ఈనాడు
జగిత్యాల
ఆదివారం అక్టోబరు 6, 2024



విద్యుత్తుశాఖలో బదిలీలు

కోరుట్ల, న్యూస్‌టుడే: ఉత్తర తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ(టీజీఎన్‌పీడీసీఎల్)లో ఉద్యోగుల బదిలీల ప్రక్రియను చేపట్టింది. ఇంజినీరింగ్ విభాగలో సబ్-ఇంజినీర్ స్థాయి నుంచి డీఈ వరకు, అకౌంట్స్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్ నుంచి ఎస్‌ఏవో వరకు, ఓఅండ్‌ఎం విభాగంలో జెఎల్‌ఎం నుంచి ఫోర్‌మెన్ వరకు బదిలీలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. విద్యుత్తుశాఖలో పాత పద్ధతిలో కాకుండా నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. గతంలో సంఘాల నాయకులకు ముందుగా బదిలీల్లో ప్రాధాన్యం కల్పించేవారు. ప్రస్తుతం ఎలాంటి పైరవీలకు తావు లేకుండా బదిలీలు చేపట్టాలని సీఎండీ వరుణ్‌రెడ్డి పకడ్బందీగా ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే సాధారణ బదిలీల జాబితాలను జిల్లా విద్యుత్తుశాఖ అధికారులు సిద్ధం చేశారు. ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న ఉద్యోగుల దరఖాస్తులు స్వీకరించగా, అకౌంట్స్, ఓ అండ్ ఎం విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులు ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. ఈనెల 4 వరకు దరఖాస్తుల స్వీకరణ గడువు పూర్తయింది. ఈనెల 7న ఉద్యోగుల బదిలీ తుది జాబితా ఉత్తర్వులను విడుదల చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. జగిత్యాల సర్కిల్ పరిధిలో 129 మంది, జగిత్యాల డివిజన్‌లో 69 మంది, మెట్‌పల్లి డివిజన్‌లో 46 మంది, జిల్లా వ్యాప్తంగా మొత్తం 244 మంది బదిలీ కానున్నారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే'తో జిల్లా ఎస్‌ఈ సాలియా నాయక్ మాట్లాడుతూ ఉద్యోగుల సీనియార్టీ ప్రకారం ఖాళీలను బట్టి బదిలీలు జరుగుతాయని, బదిలీ అయిన ఉద్యోగులు ఈనెల 14(దసరా) తర్వాత విధుల్లో చేరాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఎస్సారెస్పీకి 21 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల వ్యవసాయం: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి శనివారం సాయంత్రం వరకు ఇన్‌ఫ్లో 21,359 క్యూసెక్కులకు తగ్గగా వరదగేట్లను మూసివేశారు. వరదకాలువకు నీటి విడుదలను 12 వేల క్యూసెక్కులకు పెంచగా ఇతర కాలువలు, ఎత్తిపోతలు, మిషన్ భగీరథ కలుపుకుని మొత్తం ఔట్‌ఫ్లో 21 వేల క్యూసెక్కులుగా ఉంది.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

జగిత్యాల, న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ ప్రతీకగా నిలుస్తోందని కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ పండగ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్-జ్యోతి దంపతులు, అదనపు కలెక్టర్లు పి.రాంబాబు, బి.గౌతంరెడ్డి, జిల్లా సంక్షేమ, పంచాయతీ అధికారులు డాక్టర్ బోనగిరి నరేష్, ఎం.రఘువరన్ తదితరులు మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడారు.



బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్ దంపతులు, మహిళా ఉద్యోగులు

కొండగట్టును దివ్యక్షేత్రంగా తీర్చిదిద్దుతాం

మల్యాల, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్ సహకారంతో కొండగట్టును దివ్య క్షేత్రంగా తీర్చిదిద్దుతామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్పష్టం చేశారు. శనివారం తితిదే డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు జె.నాగరాజు, ఏఈ ఎస్.నాగరాజు, ఈవో రామకృష్ణారావుతో కలిసి ఆలయ పరిధిలో వంద గదుల ధర్మశాల నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జూన్‌లో కొండగట్టు అంజన్న దర్శనానికి వచ్చిన ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ భక్తుల సౌకర్యం కోసం తితిదే నిధులతో వంద గదులు నిర్మిస్తామని హామీ ఇచ్చారన్నారు. గత ప్రభుత్వం కొండగట్టులో రూ.600 కోట్లతో అభివృద్ధి చేస్తామని ప్రకటించినా నిధులు ఇవ్వలేదని విమర్శించారు. ఈ సందర్భంగా 'వై' జంక్షను సమీపంలోని ఘాట్‌రోడ్డు పక్కన, దాదాపు కిలోమీటరు దూరంలోని మరో స్థలాన్ని పరిశీలించారు. చివరికి ఘాట్‌రోడ్డు పక్కనగల ఆలయ భూమిలో వంద గదుల నిర్మాణాలు చేపడితే భక్తులకు సౌకర్యంగా ఉంటుందని ప్రకటించారు. ఎండోమెంట్ డీఈ రాజేశ్, ఆదిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాంలింగారెడ్డి, ఏఈవో అంజయ్య, ప్రధాన అర్చకులు జితేంద్రప్రసాద్, స్థానాచార్యులు కపిందర్, చిరంజీవి, శంకర్‌గౌడ్, సంత ప్రకాశ్‌రెడ్డి, మల్లేశం గౌడ్ పాల్గొన్నారు.



తితిదే ఇంజినీరింగు అధికారులతో స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే సత్యం

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

జగిత్యాల వాణిజ్యం: చెట్లకొమ్మల తొలగింపు దృష్ట్యా జగిత్యాల జగిత్యాల టౌన్-2 సెక్షన్ పరిధిలో ఈ నెల 6న ఉదయం 9-11 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈ రాజిరెడ్డి తెలిపారు. పాతబస్టాండ్, విద్యానగర్, మిషన్ కంపౌండ్, పోచమ్మవాడ, బ్రాహ్మణవాడ, కొత్తవాడ, సివిల్ ఆసుపత్రి తదితర ప్రాంతాల్లోని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

న్యూస్‌టుడే, మేడిపల్లి

చిన్ని తెర.. పెద్ద సందేశం

ఆదివారం ప్రత్యేకం

సృజనాత్మకత ఉండి సినిమాలు తీయడం సాధ్యం కాని వారికి యూట్యూబ్ ఒక అవకాశంగా మారింది.. యువత దర్శకులుగా, నిర్మాతలుగా, ఫొటోగ్రఫీ తదితర సాంకేతిక రంగాల్లో తమదైన ముద్ర వేయడానికి తోడ్పడుతోంది.. ఎక్కువ మంది యూట్యూబ్‌ను ఆదాయ మార్గంగా మలచుకుంటుండగా కొందరు మాత్రం సామాజిక అంశాలను స్పృశిస్తూ లఘుచిత్రాలు నిర్మిస్తున్నారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న గంజాయి, బాలికలపై వేధింపులు, ట్రాఫిక్ నిబంధనలు అమలుపై అవగాహన కల్పిస్తూ లఘు చిత్రాలు నిర్మిస్తూ అవార్డులు కూడా సొంతం చేసుకుంటున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇలా వివిధ అంశాలను చిత్రాలుగా మలచి సామాజిక బాధ్యత చాటుతున్న వారిపై కథనం.

స్ఫూర్తిదాయక లఘు చిత్రాల రూపకల్పన

మతమా.. మానవత్వమా



లఘుచిత్రం : మతమా... మానవత్వమా

నిర్మాత, దర్శకుడు : దామెర శంకర్ **స్వస్థలం :** గోదావరిఖని

అవార్డు : వీకేఆర్, ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేం మీడియా రాష్ట్రస్థాయి అవార్డు

కథాంశం : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ హిందువును క్రిస్టియన్, ముస్లిం, హిందూ మతాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు ఆసుపత్రిలో చేర్పించి రక్తదానం చేస్తారు. కోలుకుంటున్న వ్యక్తిని తమ మతంలో చేర్చుకుంటామంటూ ముస్లిం, క్రిస్టియన్ వ్యక్తులు అంటుంటే గాయపడిన వ్యక్తి మీరిచ్చిన రక్తం తనకు వద్దంటూ చేయి కోసుకుంటాడు. అక్కడే ఉన్న వైద్యుడు మతం కంటే మానవత్వమే గొప్పదంటూ చేసిన హితబోధతో లఘు చిత్రం ముగుస్తుంది.



మధ్య తరగతి జీవితాలకు నిలువుటద్దం



దర్శకుడు : అనసూరి భూనాథా చారి

స్వస్థలం : బెజ్జంకి మండలం తోటపల్లి

ప్రస్తుతం : కరీంనగర్

లఘుచిత్రాలు : రాజవ్వ, పల్లవి, మనిషి



కథాంశాలు : భర్త తాగుడుకు బానిసైనా, తను నిరాదరణకు గురయినా నిలదొక్కుకునే అంశంతో రాజవ్వను తెరకెక్కించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న చాలా మంది బాలికలను ప్రోత్సహించాల్సింది పోయి వారిని సూటిపోటి మాటలతో వేధించే వారే ఎక్కువ. ప్రభుత్వ పాఠశాలలో చదివే ఓ బాలిక తన తల్లి క్యాన్సర్‌తో బాధపడుతుంటే మధ్యాహ్న భోజనం సమయంలో ఇచ్చే గుడ్డు తీసుకుని ఇంటికి వెళ్తుంది. తోటి పిల్లలు గుడ్డు దొంగతనం చేస్తోందంటూ బాలికపై ఫిర్యాదు చేస్తారు. ప్రిన్సిపల్ బాలిక వెనకే వెళ్లి చూడగా పేదరికంతో మగ్గుతున్న తన తల్లికి క్యాన్సర్ ఉన్నందున గుడ్డు తినిపిస్తుందని తెలిసి చిన్నారిని ప్రోత్సహించిన అంశంతో పల్లవి అనే లఘు చిత్రాన్ని తీశారు. మనిషి పశువైతే అనే లఘుచిత్రంలో మానవత్వం లేని క్రూరుడిని ధైర్యం కూడబలుక్కుని చంపేసే చిన్నారుల కథతో లఘు చిత్రం తెరకెక్కించారు.

మత్తు వదలాలని..

దర్శకుడు : శివకృష్ణ బుర్రా

నిర్మాణం : మై విలేజ్ షో

స్వస్థలం : లంబాడిపల్లి, మల్యాల మండలం

లఘు చిత్రం : రేవ్‌పార్టీ






కథాంశం : గంజాయికి అలవాటుపడిన యువకులు కుటుంబసభ్యులను ఇబ్బందులకు గురి చేస్తుంటారు. పోలీసులు నిఘా వేసి రేవ్ పార్టీ ఏర్పాటు చేసి యువకులను ఆ పార్టీకి రప్పించి అరెస్టు చేస్తారు. గంజాయి సరఫరా సహా డీలర్లపై నిఘా పెంచుతారు. మత్తుకు బానిసైన యువకులను రిహాబిలిటేషన్ కేంద్రానికి పంపి మామూలు యువకులుగా మారుస్తారు.

సామాజిక అంశాలే ఇతివృత్తంగా..



వన్ డే ఫర్ సీనియర్ సిటిజన్స్



రామ్ మొగిలోజి

దర్శకుడు: రామ్ మొగిలోజి **స్వస్థలం :** గంగాధర మండలం కాసారం

ప్రస్తుత నివాసం : కరీంనగర్

లఘుచిత్రాలు : వృద్ధుల హక్కుల పరిరక్షణ, స్త్రీ స్వేచ్ఛ, అంకితం, డయల్ 100, గంజాయి డౌన్‌డౌన్

■ ఒడిశాలో ప్రస్తుతం నిర్వహిస్తున్న అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో గంజాయి డౌన్‌డౌన్ లఘుచిత్ర దర్శకుడు రామ్ మొగిలోజి బెస్ట్ డైరెక్టర్‌గా నామినేట్ అయ్యారు. అక్టోబరు 17న తుది ఫలితాలు వెలువడనున్నాయి.

కథాంశాలు : నిత్య జీవితంలో వివిధ ప్రదేశాల్లో నిరాదరణకు గురవుతున్న వృద్ధులకూ హక్కులు ఉంటాయనే వివరణతో చిత్రం తీశారు. స్త్రీ స్వేచ్ఛ అనే చిత్రంలో స్త్రీ అంటే భారం కాదు ఆస్తిగా భావించే రోజులొచ్చాయనే అంశాన్ని స్పృశించారు. భార్య, కుమారుడితో ఉంటున్న కానిస్టేబుల్ విధి నిర్వహణకే అంకితమై కుటుంబానికి సమయం ఇవ్వలేక... ఓ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అంశాన్ని అంకితం ద్వారా వివరించారు. విధి నిర్వహణలో ఉన్న మహిళా ఎస్సై తన కూతురుకు తీవ్ర జ్వరం వచ్చినా ఫోన్‌కూ స్పందించకపోవడంతో అక్కయ్యతో కలిసి ఆసుపత్రికి వెళ్తుంటే ఆకతాయిల నుంచి ప్రమాదంలో పడే సమయంలో తనను తాను రక్షించుకునే కథను డయల్ 100లో చూపారు. పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యం వహిస్తే గంజాయి బారిన పడిన చిన్నారి కథాంశంతో గంజాయి డౌన్ డౌన్ అనే లఘుచిత్రం తీశారు.



మాట్లాడుతున్న విప్ లక్ష్మణ్‌కుమార్

అర్హులందరికీ రుణమాఫీ

జగిత్యాల, న్యూస్‌టుడే: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శనివారం జగిత్యాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రుణమాఫీ కాలేదని కొందరు నాయకులు రైతులను తీసుకొచ్చి ధర్నా చేయడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. భారాస ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేశామన్నారు. జిల్లాలో 65,970 మంది రైతులకు సుమారు రూ.500 కోట్లు మాఫీ చేశామని కొన్ని సాంకేతిక కారణాల వల్ల కొందరికీ రుణమాఫీ జరగలేదని వారందరు దరఖాస్తు చేసుకున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో కలిసి మాఫీ విషయమై జిల్లా కలెక్టర్‌తో చర్చించామన్నారు. త్వరలో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామన్నారు. పురపాలక ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతి, మాజీ ఛైర్‌పర్సన్ టి.విజయలక్ష్మి, పీసీసీ సభ్యుడు బండ శంకర్, రమేష్‌బాబు, దుర్గయ్య, రాజేందర్, సంతోష్, టి.దేవేందర్‌రెడ్డి, ముస్కు నిశాంత్‌రెడ్డి, పుప్పాల అశోక్ తదితరులున్నారు.

కీళ్లనొప్పులు... మచ్చలు



జిల్లాలో జ్వరాల పంజా ● 272 డెంగీ కేసులు నమోదు

న్యూస్‌టుడే, జగిత్యాల, రాయికల్

వాతావరణంలో మార్పులు.. పల్లెల్లో పారిశుద్ధ్య లోపం.. తదితర కారణాలతో జిల్లాలో జ్వరాలు పంజా విసురుతున్నాయి. డెంగీ, మలేరియా, చికున్‌గన్యా కేసులు పెరుగుతున్నాయి. జిల్లాలో ఇప్పటివరకు 272 డెంగీ, అయిదు చికున్‌గన్యా కేసులు నమోదయ్యాయి. జ్వరాలు వచ్చి తగ్గినా ముక్కుపై మచ్చలు, కీళ్ల నొప్పులతో కదలలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు.

జగిత్యాల, రాయికల్, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి ప్రాంతాల్లో చికున్ గన్యా లక్షణాలతో జ్వరాలు విపరీతంగా పెరుగుతున్నాయి. జ్వరాలతో పాటు ఒళ్లు, కీళ్ల నొప్పులు, కాళ్లు, చేతులు వాపు రావడం, ముక్కుపై నల్లని మచ్చలతో పాటు నడవడానికి వీలు లేకుండా ఇబ్బందులు పడుతున్నారు. దోమల ద్వారా ఒకరి నుంచి మరొకరికి జ్వరాలు వ్యాపించడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. డెంగీ జ్వరంతో రక్తంలో రక్తకణాలు తగ్గుతుంటాయి. ఎక్కువగా జ్వరాలతో రక్తంలో సీఆర్పీ ప్రొటీన్ పెరగడంతో కీళ్ల నొప్పులు వస్తున్నాయి. ఒక ఇంట్లో ఒకరికి జ్వరం సోకితే ఇంట్లో అందరూ వ్యాపిస్తోంది. జ్వరాలు తగ్గినా ఒళ్లు, కీళ్ల నొప్పులు, ముక్కు మీద మచ్చలు, కాళ్ల వాపులు వస్తుండటంతో అవస్థలు పడుతున్నారు. జ్వరం తగ్గడానికి పారాసిటమల్‌తో పాటు చికున్ గన్యా నొప్పుల మాత్రలు వాడవచ్చుని వైద్యులు సూచిస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో జ్వరాల నియంత్రణకు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాల్సి ఉంది.



చల్‌గల్‌లో ఇంటింటి జ్వర సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

చికున్ గన్యా

చికున్ గన్యా సోకితే 102 డిగ్రీల కన్నా ఎక్కువ తీవ్రతతో జ్వరం వస్తుంది. తీవ్రమైన కీళ్ల, కండరాల నొప్పులు ఉంటాయి. చిన్న కీళ్లు ఎక్కువగా ప్రభావితం అవుతాయి. ప్రధానంగా చేతి మణికట్టు, కాళ్లు, మడమలు, భుజాల్లో నొప్పి ఉంటుంది. కొందరిలో కాళ్ల వాపులు, చర్మంపై దద్దుర్లు, ముఖం, ముక్కుపై నల్లటి మచ్చలు ఏర్పడతాయి.

ప్రత్యేక వైద్య శిబిరాల ఏర్పాటు



జిల్లాలో ఇప్పటి వరకు 272 డెంగీ, అయిదు చికున్ గన్యా కేసులు నమోదయ్యాయి. దోమల నివారణ చర్యల ద్వారా వ్యాధుల నియంత్రణ సాధ్యమవుతుంది. జ్వరాలు అధికంగా నమోదవుతున్న గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. గ్రామాల్లో జ్వర సర్వే ద్వారా బాధితులను గుర్తించి రక్తపరీక్షలు చేయించి చికిత్స అందిస్తున్నాం. చికున్ గన్యా, డెంగీ, వైరల్ జ్వరాలు సోకితే అన్ని ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉన్నాయి. జ్వరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం.

- డా.శ్రీనివాస్, జిల్లా ఉపవైద్యాధికారి

పేదల పక్షపాతి వెంకటస్వామి



నివాళి అర్పిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, అధికారులు

జగిత్యాల, న్యూస్‌టుడే: మాజీ కేంద్ర మంత్రి, దివంగత వెంకటస్వామి పేదల పక్షపాతిగా పేరు తెచ్చుకున్నారని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం నిర్విరామంగా కృషి చేశారని కొనియాడారు. అదనపు కలెక్టర్లు, పి.రాంబాబు, బి.గౌతంరెడ్డి, కలెక్టరేట్ ఏవో పి.హన్మంతరావు, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఎల్.సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

● కేంద్ర మాజీ మంత్రి దివంగత వెంకటస్వామి తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారని జిల్లా అదనపు ఎస్పీ భీంరావు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీఎస్పీ రవీంద్రకుమార్, ఏవో శశికళ, ఆర్.ఐ. కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



వి.శరణ్య



బి.స్వాతి

జగిత్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాకు చెందిన ఇద్దరు బాలికలు సాఫ్ట్‌బాల్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల రాజన్నసిరిసిల్ల జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో జగిత్యాల జిల్లా జట్టు నాలుగో స్థానంలో నిలవగా, జట్టుకు చెందిన బి.స్వాతి, వి.శరణ్య ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని జిల్లా సంఘం అధ్యక్షుడు మనోహర్, కార్యదర్శి వెంకటేశ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లాలోని నంద్యాలలో ఈ నెల 6 నుంచి 10 వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రజట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు చెట్‌పల్లి సుధాకర్, జమీల్, గౌతమ్ అభినందించారు.

పైపైనే జలం

యాసంగి సాగుకు భరోసా

న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం,

వానాకాలం సీజను ముగింపునకు వస్తున్నా ఈ సారి జిల్లాలోని చాలా మండలాల్లో భూగర్భ జలమట్టం కనిష్ఠస్థితిలోనే ఉంది. సాధారణంకన్నా అధికవర్షం కురవగా ఆయకట్టుకు శ్రీరామసాగర్ ప్రాజెక్టు నీరు రావటం, చెరువులు అలుగు పారటంతో భూగర్భ జలమట్టం మరింతగా పైకివచ్చింది. నీటి లభ్యతతో జిల్లాలో ఈ వానాకాలంలో అధికారుల అంచనాను దాటి 112 శాతం విస్తీర్ణంలో 4.43 లక్షల ఎకరాల్లో రైతులు అన్నిరకాల పంటలను సాగుచేశారు. వరిసాగు 3.16 లక్షల ఎకరాలను దాటి రాష్ట్రంలోనే నాలుగవ స్థానంలో నిలిచింది. పసుపుసాగులో జిల్లా రాష్ట్రంలో రెండోస్థానంలో ఉంది. ప్రస్తుతం భూగర్భ జలమట్టం కనిష్ఠ స్థాయిలోనే ఉండటంతో వానాకాలం పంటలను ఇబ్బంది లేకుండా పూర్తిచేసే అవకాశం రైతులకు కలిగింది. మొక్కజొన్న, పెసర, సోయా తదితర పంటలు పూర్తవుతుండగా వరి నూర్పిడి ప్రారంభమైంది. జిల్లాలో అందుబాటులోని భూగర్భ జలాలతో బావులు, బోర్ల ఆధారితం, ఎస్సారెస్పీ నీరు యాసంగి సాగుకు ఉపకరిస్తుందని భూగర్భ జలవనరుల శాఖ జిల్లా అధికారి నర్సింహులు పేర్కొన్నారు.



సారంగాపూర్ మండలం అర్పపల్లిలో బావిలో నీరు

సెప్టెంబరు-2024 నెలాఖరున భూగర్భ జలమట్టం

మండలం	నీటిమట్టం (లోతు మీటర్లలో...)
బీర్‌పూర్	0.92
బుగ్గారం	3.05
ధర్మపురి	2.85
ఎండపల్లి	7.96
గొల్లపల్లి	2.60
జగిత్యాల రూరల్	0.80
జగిత్యాల అర్బన్	3.30
పెగడపల్లి	1.80
రాయికల్	1.35
సారంగాపూర్	2.72
వెల్గటూరు	2.07
కొడిమ్యాల	5.18
మల్యాల	2.48
ఇబ్రహీంపట్నం	2.53
కోరుట్ల	4.24
మల్లాపూర్	2.05
భీమారం	1.50
కథలాపూర్	1.00
మేడిపల్లి	2.28
మెట్‌పల్లి	2.88
జిల్లాసగటు	2.29

జిల్లాలో సాధారణ వర్షపాతం: **831.0** మి.మీ ఇప్పటివరకు కురిసినది: **1014.1** మి.మీ

ఆగస్టు నెలాఖరున జిల్లా సగటు భూగర్భ జలమట్టం: **2.68** మీటర్లు

సెప్టెంబరు నెలాఖరున జిల్లా సగటు భూగర్భ జలమట్టం: **2.29** మీటర్లు


ఉమ్మడి జిల్లాలో న్యాయమూర్తులకు స్థానచలనం

జగిత్యాల, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో ఆరుగురు జూనియర్, సీనియర్ సివిల్ జడ్జిల బదిలీలు జరగ్గా వారిస్థానాల్లో వివిధ ప్రాంతాల నుంచి కొత్త వారిని నియమించారు. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. జగిత్యాల సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రసాద్‌ను జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శిగా నియమించారు. సికింద్రాబాద్ జ్యుడిషియల్ అకాడమి ఏవోగా ఉన్న కె.వెంకటమల్లిక్ సుబ్రమణ్యశర్మ జగిత్యాల సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. పెద్దపల్లి జూనియర్ సివిల్ జడ్జి కె.రాణిని కరీంనగర్ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైశ్వాల్‌ను అక్కడే జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శిగా నియమించారు. సంగారెడ్డి జూనియర్ సివిల్ జడ్జి పి.లక్ష్మణాచారిని రాజన్నసిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. చేవెళ్ల సీనియర్ సివిల్ జడ్జి పి.బి.కిరణ్‌కుమార్‌ను హుజూరాబాద్ సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. షాద్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి జీవన్ సూరజ్‌సింగ్‌ను గోదావరి సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. భువనగిరి జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావును మెట్‌పల్లి సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. గోదావరిఖని సీనియర్ సివిల్ భృంగి శ్రీనివాస్‌ను పెద్దపల్లి సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. అక్కడి కె.స్వరూపరాణిని పెద్దపల్లి న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శిగా నియమించారు.

వసంతోత్సవం.. శాకంబరి అలంకరణ



జగిత్యాల విద్యానగర్: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం వసంతోత్సవం, శాకంబరిగా అమ్మవారిని అలంకరించారు. శ్రీలోకమాతా పోచమ్మతల్లి ఆలయంలో శాకంబరి అమ్మవారిగా నవదుర్గా క్షేత్రపీఠంలో, కనకదుర్గా సేవా సమితి అష్టలక్ష్మి దేవాలయంలో చంద్రఘంటా రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మంత్రపుష్పం, మాతలచే మణిద్వీప వర్ణన పూజ, సాయంత్రం వివిధ రకాల పండ్లతో వసంతోత్సవ కార్యక్రమం నిర్వహించారు.



గజవాహనంపై శ్రీవారి దర్శనం

కోరుట్ల పట్టణంలోని పురాతన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం గజ వాహనంపై శ్రీవారు దర్శనమిచ్చారు. పట్టణంలోని పుర వీధుల్లో స్వామి వారి ఊరేగింపు చేపట్టారు. భక్తులు, మహిళలు స్వామి వారిని దర్శించుకున్నారు.

- న్యూస్‌టుడే, కోరుట్ల

సెలవులో వెళ్లిన కలెక్టర్

జగిత్యాల: జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ శనివారం సెలవులో వెళ్లారు. వ్యక్తిగత పనుల మీద వారంరోజులు సెలవులో వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతించింది. 14న తిరిగి విధులకు హాజరవుతారు.

మేమున్నాం.. మీకు తోడుగా...

(10 AM TO 1 PM)

జగిత్యాల 94400 23123

కోరుట్ల 9491324656 ధర్మపురి 94403 88638

న్యూస్‌టుడే – మల్యాల

? మల్యాల నుంచి బస్టాండు మీదుగా పెద్దమ్మవాడకు వెళ్లే రహదారి మధ్యలో కల్వర్టు పక్కన మట్టి కుంగడంతో గుంత ఏర్పడింది.
- మల్యాల గ్రామస్థులు

✓ రహదారి మధ్యలో కల్వర్టు పక్కన కుంగిన ప్రాంతంలో మట్టిపోయించి చదును చేయిస్తాం. -శ్రీకాంత్, మల్యాల గ్రామపంచాయతీ ఈవో

విద్యుత్తు సరఫరా నిలిపివేత

కోరుట్ల: కోరుట్ల పట్టణంలోని ఆనంద్‌నగర్, నక్కలగుట్ట ప్రాంతంలో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మాదాపూర్ కాలనీలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్యామ్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సిబ్బంది కొరత లేకుండా చర్యలు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం సందర్శించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి మరమ్మతు కోసం నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బోరిగం రాజు, ఉపాధ్యక్షుడు ఎలాల వెంకట్‌రెడ్డి, గూడ శ్రీకాంత్, గంగాధర్, రాములు, శ్రావణ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడం కూల్చివేత

కోరుట్ల: పట్టణంలోని సాయిరాంపుర కాలనీలో అనుమతికి విరుద్ధంగా చేపట్టిన కట్టడాన్ని కోర్టు ఉత్తర్వుల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం శనివారం కూల్చివేశారు. టీజీ బీపాస్ ద్వారా అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం నిర్మించాలని, అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు. కమిషనర్ తిరుపతి, తహసీల్దార్ కిషన్, టీపీవో ప్రవీణ్, టీపీఎస్ రమ్య, రాజేందర్‌రావు తదితరులున్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించండి

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం బీసీ కుల గణన చేపట్టి, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని బీసీ కుల సంఘాల జేఏసీ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి అన్నారు. మండలకేంద్రంలో బీసీ కుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. అంజయ్య, ప్రవీణ్, కొక్కు పురుషోత్తం, సుగుణాకర్‌రావు, రమేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలి

మెట్‌పల్లి: మెట్‌పల్లి మండలం వెల్లుల్లలో తలెత్తిన సమస్యను ఇరువర్గాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలని డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు సూచించారు. దసరా ఉత్సవాల సందర్భంగా జరిగే దేవుడి ఊరేగింపు(శావ) విషయంలో తమ పట్ల చిన్నచూపు చూస్తున్నారని శుక్రవారం దళితులు డీఎస్పీకి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు శనివారం వీడీసీ సభ్యులు, ఫిర్యాదుదారులను పిలిపించి ఇరువర్గాలకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

మల్లాపూర్, న్యూస్‌టుడే: ఇటిక్యాల నివేదిత ఆశ్రమంలోని వృద్ధులకు మెట్‌పల్లి మండలం వెంపేటకు చెందిన వైద్యులు డా. గాజెంగి రాజమల్లయ్య జన్మదినం పురస్కరించుకొని దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. వృద్ధులతో కలిసి భోజనాలు చేశారు. పరిమళ, వర్ధన్, పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రాజమల్లయ్య

త్వరలోనే తెలుగు కళాశాలకు పూర్వ వైభవం

ధర్మపురి, న్యూస్‌టుడే: త్వరలోనే తెలుగు కళాశాలకు పూర్వ వైభవాన్ని తీసుకుస్తామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శనివారం హైదరాబాద్‌కి చెందిన స్వశోధన్ ట్రస్టు సభ్యులు శ్రీ లక్ష్మీనరసింహ తెలుగు కళాశాలకు బహూకరించిన కంప్యూటర్, ప్రింటర్‌ను విప్ చేతుల మీదుగా కళాశాల ప్రిన్సిపల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురై మూత బడిన తెలుగు కళాశాలను పునరుద్ధరించడంతో పాటు అన్ని హంగులతో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో స్వశోధన్ ట్రస్టుకి చెందిన భార్గవ, కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్, కార్యదర్శి రామకిష్టయ్య పాల్గొన్నారు.



జగిత్యాల: వెలమ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో..



ధర్మపురి: నదిలో బతుకమ్మల నిమజ్జనం

బతుకమ్మ సంబరాలు

కళాశాలల్లో శనివారం బతుకమ్మ సంబరాలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలతో బతుకమ్మలను పేర్చి విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు కోలాటం ఆడారు. - న్యూస్‌టుడే యంత్రాంగం



కొడిమ్యాలలో..



జగిత్యాలలో..



సారంగాపూర్: బతుకమ్మను తీసుకొస్తున్న అధ్యాపకులు, విద్యార్థినులు



రాయికల్ పట్టణంలో..



కోరుట్లలో..



మల్లాపూర్‌లో..



మెట్‌పల్లిలో..

జిల్లా అభివృద్ధికి కృషి

సారంగాపూర్, న్యూస్‌టుడే: సీఎం నాయకత్వంలో జిల్లా అభివృద్ధికి ప్రత్యేక నిధులకు తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని నాగునూర్‌లో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ అనంతరం సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని పలు కల్యాణలక్ష్మి, సీఎం సహాయనిధి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. దెబ్బతిన్న రహదారులు, వంతెనలకు సారంగాపూర్ మండలంలో రూ.20 లక్షలు, బీర్‌పూర్ మండలంలో రూ.11 లక్షలు మంజూరయ్యాయని వెంటనే మరమ్మతు పూర్తి చేసి ఇబ్బంది లేకుండా చూడనున్నట్లు తెలిపారు.

రాయికల్ పట్టణం: వరద ప్రభావిత ప్రాంతాల్లో తాత్కాలిక మరమ్మతు కోసం రూ.30 లక్షల నిధులు మంజూరయ్యాయని, అధికారులు ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని గూడెటి రెడ్డి సంఘం భవనంలో రాయికల్ పట్టణం, మండలంలోని పలు గ్రామాలకు చెందిన 40 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.9 లక్షల 66 వేలు, 25 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద మంజూరైన రూ.25 లక్షల చెక్కులను శనివారం పంపిణీ చేశారు. పుర అధ్యక్షుడు హన్మాండ్లు, తహసీల్దార్ ఖయ్యూం, ఎంపీడీవో పాల్గొన్నారు.



నాగునూర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



ధర్మపురిలో..



మెట్‌పల్లిలో..



మల్యాలలో..



రాయికల్: మైతాపూర్‌లో..



కొడిమ్యాలలో..



గొల్లపల్లిలో..

వైభవంగా శరన్నవరాత్రి వేడుకలు

దుర్గామాత నవరాత్రి వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు చంద్రఘంటా, శాకంబరి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అన్నదానాలు చేశారు. -న్యూస్‌టుడే, యంత్రాంగం



రాయికల్‌లో..



వేంపేటలో కుంకుమార్చన



వెల్గటూరులో..



జగిత్యాల: కుంకుమ పూజ

మహోన్నత నాయకుడు వెంకటస్వామి

వెల్గటూరు, న్యూస్‌టుడే: మహోన్నత నాయకుడు వెంకటస్వామి(కాకా) అని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం వెల్గటూరు అంబేడ్కర్ కూడలిలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వెంకటస్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. తన లాంటి సామాన్యులకు రాజకీయ జీవితం ప్రసాదించారన్నారు. ఏఎంసీ వైస్‌ఛైర్మన్ తిరుపతి, నాయకులు శైలేందర్‌రెడ్డి, రాంమోహన్ రావు, జితేందర్‌రెడ్డి, మురళి, కోటయ్య, మంజుల, తిరుపతి, మల్లేశంగౌడ్, సందీప్‌రెడ్డి, ఉదయ్, వెంకటేశ్ పాల్గొన్నారు.



వెల్గటూరులో కాకా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్

ధర్మపురి: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన వెంకటస్వామి అడుగుజాడల్లో కాంగ్రెస్ శ్రేణులు నడువాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శనివారం ధర్మపురి పట్టణంలో వెంకటస్వామి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ నాయకులు దినేష్, లక్ష్మణ్, ప్రసాద్, రాజేష్, శ్రీనివాస్, రఫియోద్దీన్, సత్యనారాయణ, నరేందర్ పాల్గొన్నారు.

గొల్లపల్లి: కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి 95వ జయంతి వేడుకలను గొల్లపల్లి మార్కెట్ యార్డులో ఏఎంసీ ఛైర్మన్ భీమ సంతోష్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో వెంకటస్వామి కీలక పాత్ర పోషించారన్నారు. వైస్ ఛైర్మన్ రాజిరెడ్డి పాల్గొన్నారు.



గొల్లపల్లి: మార్కెట్ యార్డులో..

రాయికల్ పట్టణం: కేంద్ర మాజీ మంత్రి జి. వెంకటస్వామి జయంతి వేడుకలను పురపాలక సంఘం, తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. పుర అధ్యక్షుడు హన్మాండ్లు, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, తహసీల్దార్ ఖయ్యూం, మేనేజర్ వెంకటి, పుర, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కోరుట్ల: కోరుట్ల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గడ్డం వెంకటస్వామి(కాకా) జయంతిని శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జువ్వాడి కృష్ణారావు, గంగాధర్, రాజం, నర్సయ్య, దివాకర్, దశరతం, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూముల సర్వే

మల్లాపూర్, న్యూస్‌టుడే: మల్లాపూర్ మండలం మొగిలిపేటలోని అటవీ ప్రాంతం సర్వే నంబర్ 465/19లోని భూములను శనివారం జిల్లా అటవీశాఖ అధికారి రవి, మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. మొగిలిపేట గ్రామానికి చెందిన పెరంబదూర్ శారదతో పాటు మరి కొంతమందికి అటవీ ప్రాంతంలో 9 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయని కోర్టుకు వెళ్లారు. కోర్టు ఆదేశాల మేరకు అధికారులు సర్వే చేశారు. సదరు భూములను 1952లో రిజర్వ్ ఫారెస్ట్‌కు కేటాయించినట్లు అధికారులు పేర్కొన్నారు. సర్వేలో ఎఫ్ఆర్వో పద్మారావు, డిప్యూటీ ఎఫ్ఆర్వో హఫిజొద్దిన్, సెక్షన్ అధికారులు చైతన్య, బీట్ అధికారులు సత్తార్, ఆర్ఐ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్ గ్రామశివారులో వివాదాస్పద భూమిని రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు శనివారం సంయుక్త సర్వే చేశారు. గ్రామానికి చెందిన మల్లేష్, గంగు, రాజ గంగు, పెద్ద గంగారం అనే రైతులకు 87, 131 సర్వే నంబర్లలో పట్టా భూములుండడంతో కొంతకాలంగా సాగు చేసుకుంటున్నారు. అటవీ అధికారులు అవి అటవీ భూములని కందకం తీయడంతో బాధిత రైతులు హైకోర్టులో కేసు వేశారు. కోర్టు ఆదేశాల ప్రకారం రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సంయుక్త సర్వే చేపట్టారు. ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా అటవీ అధికారి రవిప్రసాద్, తహసీల్దార్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న వాహనం

మల్యాల, న్యూస్‌టుడే: కొండగట్టు ప్రాంతంలోని జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారి పక్కన శనివారం ఉదయం ఓ వాహనం చెట్టును ఢీకొట్టింది. కూరగాయల లోడుతో కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వస్తున్న వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొని కొంత దూరం దూసుకెళ్లింది. డ్రైవరు స్వల్ప గాయాలతో బయటపడ్డట్లు స్థానికుల ద్వారా తెలిసింది.

ఇంటిపెద్దపై కుటుంబ సభ్యుల దాడి

సారంగాపూర్, న్యూస్‌టుడే: మండలంలోని వడ్డెరకాలనీకి చెందిన తండ్రిపై భార్య, కుటుంబ సభ్యులు దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. గ్రామానికి చెందిన దండుగల నడ్పి నర్సయ్యపై భార్య సుశీల కుమారులు లవన్, కిషన్, కోడలు రమలు కుటుంబ కలహాలతో దూషిస్తూ, దాడికి పాల్పడడంతో గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు.

మండల పరిషత్ కార్యాలయంలో పాము కలకలం

మల్యాల, న్యూస్‌టుడే: మల్యాల మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పాము కలకలం రేపింది. కార్యాలయంలోని మరుగుదొడ్డి గదిలోకి వెళ్లడంతో సిబ్బంది వెంటనే పాములు పట్టే వ్యక్తికి సమాచారం అందించడంతో పట్టుకుని గుట్ట ప్రదేశంలో వదిలిపెట్టారు.

అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

రాయికల్ పట్టణం, న్యూస్‌టుడే: పీఆర్టీయూ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దాసరి కృష్ణహరిని సన్మానించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రమేష్, సతీష్, గంగారాజం, నర్సయ్య, అభయ్‌రాజ్, బాపురావు, రమేష్, రాజేశం, నరేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

అంజన్నను దర్శించుకున్న న్యాయమూర్తి

మల్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల జిల్లా ఫస్ట్‌క్లాస్ సెషన్స్ జడ్జి ఎస్.నారాయణ శనివారం సాయంత్రం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఈవో రామకృష్ణ న్యాయమూర్తిని స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదం అందజేశారు. అర్చకులు ఆశీర్వదించారు.

స్వామివారి పల్లకీ సేవ

సారంగాపూర్, న్యూస్‌టుడే: బీర్‌పూర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రులలో భాగంగా శనివారం రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వొద్ది పర్తి సంతోషాచార్యులు, మధుకుమారాచార్యులు, చిన్న సంతోషాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారిని పల్లకీలో కూర్చోపెట్టి ఊరేగించారు. సారంగాపూర్ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన దుబ్బరాజన్న సన్నిధిలో దుర్గామాత పూజలు చంద్రశేఖర్ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈవో కాంతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పల్లకీ సేవ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే

జగిత్యాల, న్యూస్‌టుడే: తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదేనని జగిత్యాల ఆర్డీవో పి.మధుసూదన్ అన్నారు. శనివారం వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం కింద వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపారు. మల్యాల మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన తొట్ల కొమురయ్య, బుగ్గారం మండలం గోపులాపూర్‌కు చెందిన పెరుమాండ్ల లింగవ్వ, జగిత్యాల వంజరివాడకు చెందిన కాలేరు ఈశ్వరయ్య, క్రిష్ణానగర్‌కు చెందిన వేముల లీలావతి ఇచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపారు. వారి కుమారులు, కోడళ్లకు కౌన్సెలింగ్ ఇచ్చి వాంగ్మూలం తీసుకున్నారు. ఏవో తఫజుల్ హుస్సేన్, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ తదితరులున్నారు.

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు

జగిత్యాల, న్యూస్‌టుడే: జిల్లాలో వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం పౌరసరఫరాల అధికారులు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం ఏ గ్రేడ్ రకానికి క్వింటాలుకు రూ.2320, కామన్ రకానికి రూ.2300 మద్దతు ధర నిర్ణయించిందని సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించిందన్నారు. సన్న, దొడ్డు రకాలు వేర్వేరుగా కొనుగోలు చేయాలని వ్యవసాయాధికారులు తేమ శాతం పరీక్షించి ధ్రువీకరించిన తర్వాతే తూకం వేయాలన్నారు. టోకెన్ పద్ధతి పాటించాలని కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన ధాన్యం శుద్ధి యంత్రాలు, గన్నీసంచులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన మిల్లులకు వెంటనే తరలించాలని రైతుల ఖాతాల్లో వెంటనే సొమ్ము జమచేసేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్, మేనేజర్ జితేంద్రప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి రాంచంద్రం, డీఆర్డీవో, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుల బహిష్కరణ

మల్లాపూర్, న్యూస్‌టుడే: మల్లాపూర్ మండలం రత్నాపూర్‌లో కుచనపల్లి మహంతి, శ్రీనివాస్ కుటుంబాన్ని కుల బహిష్కరించినట్లు బాధితులు పేర్కొన్నారు. కుటుంబానికి జరుగుతున్న అన్యాయాన్ని సెప్టెంబర్-3న మల్లాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కుల సంఘాల వారు ఏడాది నుంచి కుల బహిష్కరణ చేయడంతో పాటు ఎవరితోనూ మాట్లాడటం లేదని వాపోయారు. భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఈ విషయమై ఎస్సై కిరణ్‌ను సంప్రదించగా ఇరువర్గాలను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

కామారెడ్డికి తరలిన కిసాన్‌సంఘ్ రైతులు

మల్లాపూర్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని భరతమాత చౌరస్తాలో కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. చలో కామారెడ్డి సభకు వెళ్తూ మల్లాపూర్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీతో పాటు రైతు భరోసా, చక్కెర కర్మగారాలను తక్షణమే తెరిపించడంతో పాటు పలు డిమాండ్ల సాధనకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కల్లెం మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కాసారపు భూమరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

734 మంది అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

జగిత్యాల, న్యూస్‌టుడే: జిల్లాలో డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తయింది. శనివారం సాయంత్రం వరకు 734 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలించారు. 26 మంది గైర్హాజరయ్యారు. ఎస్జీటీ తెలుగు మాధ్యమంలో 337 మంది పత్రాల పరిశీలనకు హాజరు కాగా 11 మంది గైర్హాజరయ్యారు. ఉర్దూ మీడియంలో 18 మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరయ్యారు. స్కూల్ అసిస్టెంట్‌కు 282 మంది హాజరు కాగా ఏడుగురు గైర్హాజరయ్యారు. లాంగ్వేజ్ పండిత్, పీఈటీ అభ్యర్థుల్లో 97 మంది హాజరు కాగా ఆరుగురు గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి పత్రాల పరిశీలనలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

క్షీరాభిషేకంతో శుద్ధి

జగిత్యాల విద్యానగర్, న్యూస్‌టుడే: జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల గోడపై ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమర యోధుడు ఆజాద్ చంద్రశేఖర్ చిత్రాన్ని భారత్ సురక్ష సమితి ఆధ్వర్యంలో శనివారం క్షీరాభిషేకంతో శుద్ధి చేశారు. అసభ్యకరంగా వ్యవహరించిన గుర్తు తెలియని వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ భజరంగ్ దళ్ కన్వీనర్ మహేందర్ పట్టణ ఠాణాలో ఫిర్యాదు చేశారు. బీఎస్ఎస్ నాయకులు ఏసీఎస్ రాజు, కాశీనాథం, భూమయ్య, బాలయ్య, వీహెచ్‌పీ నాయకులు పద్మాకర్, పరంధామ్ తదితరులు పాల్గొన్నారు

స్వామివారి ఊరేగింపు

ధర్మపురి, న్యూస్‌టుడే: ధర్మపురిలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి సేవను హనుమత్ వాహనంపై ఊరేగించారు. ముందుగా ఆలయంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో స్వామివారి సేవ కొనసాగించారు. దేవస్థానం ఈవో శ్రీనివాస్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, వేదపండితులు పాల్గొన్నారు.



పురవీధుల్లో స్వామి వారి సేవ

మల్లిక్ తేజకు బెయిల్

జగిత్యాల: జగిత్యాలకు చెందిన సాంస్కృతిక సారథి ఉద్యోగి, గాయకుడు మల్లిక్‌తేజకు హైకోర్టులో ఊరట లభించింది. సహచర మహిళా గాయకురాలు జగిత్యాల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అత్యాచారం కేసు నమోదైంది. తనపై ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా తప్పుడు ఫిర్యాదుతో కేసు నమోదైందని మల్లిక్‌తేజ హైకోర్టును ఆశ్రయించగా ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.

ఆదమరిస్తే ప్రమాదమే!

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: మెట్‌పల్లి నుంచి ఆత్మకూర్ వెళ్లే రహదారిలో వెల్లుల్ల వద్ద రహదారి గుంతలమయమై ప్రమాదకరంగా మారింది. గాంధీ విగ్రహం మూలమలుపు వద్ద, బండలింగాపూర్ మూలమలుపు వద్ద పెద్ద పెద్ద గుంతలు పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఎదురుగా ఏదైనా వాహనం వస్తే అవస్థలు పడుతున్నారు. ఈ రహదారి మీదుగా సుమారు పది గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రివేళ గుంతలు కనిపించక వాహనాలు అదుపు తప్పే అవకాశముంది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రహదారికి మరమ్మతు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.





ఆరోగ్య స్పృహతో ఆహార మార్పు

సంప్రదాయ పదార్థాలకు పెరిగిన ప్రాధాన్యం



రాగి జావ

ఆధునిక జీవనంలో అనారోగ్యాలతో సతమతమవుతున్న ఉమ్మడి జిల్లా వాసులు ఆహారపు అలవాట్లు మార్చుకుంటున్నారు. సంప్రదాయ ఆహారం మేలని రాగి, జొన్న, జావ, గటుక, చిరుధాన్యాలు, మొలకెత్తిన తృణ ధాన్యాలు వంటి వాటిని ఉదయం, సాయంత్రం ఆహారంగా తీసుకుంటున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా వాటికి డిమాండ్ పెరుగగా, విక్రయ కేంద్రాలు కూడా వెలిసిన అందుబాటులోకి వస్తున్నాయి. ఉదయం అల్పాహారంగా వీటిని తీసుకుంటున్నవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది..

న్యూస్‌టుడే- కరీంనగర్ విద్యావిభాగం

☛ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని వయసుల వారు ఆహారం, ఆరోగ్యంపై దృష్టి పెడుతున్నారు. సంప్రదాయ రుచులను ఆస్వాదిస్తున్నారు.

☛ ఉదయం వేళ అల్పాహార స్థానంలో రాగి జావ, జొన్న గట్కు, అలోవెరా, క్యారెట్, బీట్‌రూట్ జ్యూస్ తదితరాలు తీసుకునేవారు పెరుగుతున్నారు. ఉదయపు నడక, వ్యాయామాలు పూర్తి చేసి ఈ ఆహారాన్ని ఆస్వాదిస్తున్నారు.

☛ రాత్రి వేళల్లో చాలా మందికి జొన్న రొట్టె ఇష్టమైన ఆహారంగా మారిపోయింది.

☛ అధిక బరువును తగ్గించేందుకు, శక్తికి, ఎముకల బలానికి, మధుమేహ నియంత్రణకు, కొవ్వును తగ్గించేందుకు ఈ ఆహారం దోహదపడుతుందని చాలా మంది ఆసక్తి చూపిస్తున్నారు.

☛ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రధాన మైదానాలు, రహదారుల పక్కన ప్రత్యేకంగా వీటి విక్రయ కేంద్రాలు వెలిశాయి. సుమారు రెండు వందల కేంద్రాలు ఉన్నట్లు విక్రయదారులు పేర్కొంటున్నారు.

☛ నిత్యం ఒక్కో కేంద్రంలో జావ, గటుక కోసం 150 మంది వరకు వస్తున్నారని నిర్వాహకులు తెలుపుతున్నారు. వ్యాయామం చేసేవారే కాకుండా ఉద్యోగులు, గృహిణులు వీటిని తీసుకోవడం పెరుగుతోంది.

☛ మొలకెత్తిన తృణ ధాన్యాలను నిత్య ఆహారంలో భాగంగా చేసుకుంటున్నారు. దీంతో విక్రయాలు పెరుగుతున్నాయి.



కరీంనగర్‌లోని ఓ రాగి జావ కేంద్రం వద్ద సందడి

చిరుధాన్యాలతో అల్పాహారం



గటుక

నూనెతో తయారు చేసిన అల్పాహారం ఆరోగ్యానికి హాని చేస్తుందని భావిస్తున్నవారు చిరుధాన్యాలతో చేస్తున్న అల్పాహారం వైపు మొగ్గు చూపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు టిఫిన్ సెంటర్ల వారు వాటిని రుచికి తగ్గట్టుగా తయారు చేసి విక్రయిస్తున్నారు. కొర్రల ఉప్మా, రాగులతో ఇడ్లీ, దోశ, ఉప్మా, మిల్లెట్ దోశ తదితరాలు తయారు చేస్తున్నారు. పీచు, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం వాటిలో ఎక్కువగా ఉండటం కొవ్వు శాతం తక్కువ కావడంతో వాటిపై మక్కువ, అధిక బరువుతో బాధపడుతున్న వారు ఈ అల్పాహారం తీసుకునేందుకు సన్నద్ధత పెరిగింది.

విభిన్న రకాల జ్యూస్‌లు..

వివిధ రకాల జ్యూస్‌ల అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. మునగాకు, బూడిద గుమ్మడి, సొరకాయ, బీట్‌రూట్, క్యారెట్, గోధుమ గడ్డి, కలబందతో జ్యూస్‌లు తయారు చేసి విక్రయించే కేంద్రాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వెలిశాయి. వీటిల్లో ఆరోగ్యానికి అవసరమైన విలువలు ఉండటం, ఊబకాయానికి, ఇతర అనారోగ్యాల నివారణకు ఇవి ఉపకరిస్తున్నాయని భావిస్తుండటంతో గిరాకీ పెరిగింది. 35 ఏళ్ల పైబడిన వారి నుంచి వృద్ధుల వరకు నిత్యం వాటిని తీసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని నగరాలు, పట్టణాల్లో 10 వరకు వాటి విక్రయ కేంద్రాలు ఉండగా, ఒక్కో కేంద్రంలో 50 నుంచి 80 గ్లాసుల వరకు జ్యూస్‌లు విక్రయిస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు.



కలబంద జ్యూస్

ఆస్తి కోసం దారుణ హత్య

తల్లిదండ్రులతో కలిసి అన్నను చంపిన తమ్ముడు



రాజు

హుజూరాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : ఆస్తి కోసం కన్నేసిన తమ్ముడు అన్నను అడ్డు తొలగించుకుంటేనే తాను భూమి పొందొచ్చని భావించాడు.. తల్లిదండ్రులు కూడా అతనికి సహకరించారు.. దీంతో కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం రాజపల్లిలో శుక్రవారం రాత్రి నోముల రాజు (35)ను అయినవారే దారుణంగా హత్య చేశారని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రాజపల్లికి చెందిన నోముల చంద్రయ్య, ఎల్లమ్మ దంపతులకు నోముల రాజు (35), అంజి ఇద్దరు కుమారులు. అవివాహితుడైన రాజు స్థానికంగా ఉంటూ వృత్తిరీత్యా డ్రైవర్‌గా పని చేసుకుంటూ కుటుంబానికి చెందిన మూడున్నర ఎకరాల పొలంలో వ్యవసాయ పనులు చూసుకునేవారు. అంజికి వివాహం కాగా, కొంతకాలం హైదరాబాద్‌లో కారు నడుపుకొంటూ జీవించాడు. కొద్ది రోజుల క్రితం హుజూరాబాద్‌కు వచ్చి ఉంటున్నాడు. చెడు వ్యసనాలకు బానిసై అప్పులు చేసిన అతను వ్యవసాయ భూమి తనకు ఇవ్వాలని రాజుతో ఇటీవల తరచూ గొడవకు దిగుతున్నాడు. రాజు ఒప్పుకోకపోయేసరికి కక్ష పెంచుకున్నాడు. రాజును హత్య చేస్తే ఆస్తి మొత్తం తనకే దక్కుతుందని భావించి తల్లిదండ్రులతో కలిసి కుట్ర పన్నాడు. శుక్రవారం రాత్రి రాజు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో కర్రతో తలపై మోది చంపాడు. శనివారం తెల్లవారుజామున రాజు నిద్రలేవడం లేదని తల్లిదండ్రులు ఇరుగుపొరుగు వారిని పిలిచారు. మంచంపై అతను చనిపోయినట్లు కనిపించటంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ తిరుమల్‌గౌడ్, ఎస్సై మహ్మద్ యూనుస్ అలీలు సంఘటన స్థలాన్ని పరిశీలించడంతోపాటు కుటుంబసభ్యులు, గ్రామస్థులతో మాట్లాడారు. విచారణలో కుటుంబంలో గొడవలు జరుగుతున్నట్లు గుర్తించారు. క్లూస్ టీం వేలిముద్రలను సేకరించింది. రాజును తమ్ముడు అంజి, తల్లిదండ్రులు చంద్రయ్య, ఎల్లమ్మలు కలిసి బలమైన ఆయుధంతో తలపై కొట్టి హత్య చేసి ఉంటారనే అనుమానం ఉందని పంచాయతీ కార్యదర్శి కృపారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అంజి, రాజు తల్లిదండ్రులను విచారించగా కర్రతో కొట్టి చంపినట్లు వెల్లడించారని ఏసీపీ తెలిపారు. ఈ మేరకు అంజి, చంద్రయ్య, ఎల్లమ్మలను శనివారం రాత్రి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

బావను హతమార్చి వరదకాలువలో పడేసిన బావమరింది

కోరుట్ల, న్యూస్‌టుడే: చెల్లె, కోడలుకు ఆపద పొంచి ఉందని భావించి బావను బావమరిదే హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం చేశాడు. పోలీసులు అనుమానితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా హత్య విషయం బయటపడింది. కోరుట్లలో మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు శనివారం వివరాలు వెల్లడించారు. కథలాపూర్ మండలం చింతకుంటకు చెందిన నేతుల మల్లేశం 2015లో కన్న కుమారుడిని హత్య చేయగా కోరుట్ల కోర్టు ఏడేళ్లు జైలు శిక్ష విధించింది. గతేడాది జైలు నుంచి విడుదలైన ఆయన భార్య లావణ్య, కూతురును వేధిస్తూ చంపుతానని బెదిరిస్తున్నాడు. చెల్లె, కోడలుకు అతనితో ఆపద ఉందని భావించి బావను హత్యచేయాలని భూషణ్‌రావుపేటకు చెందిన భూపతి గంగారాం నిర్ణయించుకున్నాడు. ఈ నెల 1న మల్లేశంకు ఫోన్ చేసి ఇంటికి పిలిపించుకొని మద్యం తాగించాడు. అనంతరం మెట్‌పల్లి మండలం వెల్లుల్ల శివారులో విందు ఉందని చెప్పి అక్కడికి తీసుకెళ్లి మద్యం తాగారు. రాత్రి ఇంటికి తిరిగొచ్చే క్రమంలో దుంపేట వరద కాలువ వద్ద మళ్లీ మద్యం తాగారు. మల్లేశం మద్యం మత్తులో ఉండగా గంగారాం బండరాయితో తలపై మోదడంతో పాటు వంతెన గోడకు బలంగా బాదాడు. మృతదేహాన్ని కాలువలో పడేసి వాహనాన్ని కిందపడేసి పరారయ్యాడు. వరద కాలువ వంతెన వద్ద మల్లేశం ద్విచక్ర వాహనం పడి ఉండడంతో పాటు కనిపించడం లేదని ఆయన సోదరుడు రాజమల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గంగారాంపై అనుమానంతో 4న అదుపులోకి తీసుకొని విచారించగా హత్య విషయం, కారణాలను వెల్లడించారు. మృతదేహం మేడిపల్లి మండలం విలయతాబాద్ వద్ద లభించిందని, హత్యలో గంగారాంతో పాటు ఇంకెవరైనా పాలుపంచుకున్నారా అని దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు. సీఐ సురేష్‌బాబు, కథలాపూర్ ఎస్సై నవీన్‌కుమార్ ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

తుది దశకు డీఎస్సీ-2008 ధ్రువపత్రాల పరిశీలన

కరీంనగర్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఒప్పంద పద్ధతిలో ఎస్జీటీల నియామకాలకు జిల్లా విద్యాశాఖ చేపట్టిన ఉమ్మడి జిల్లాలోని డీఎస్సీ 2008 బాధిత అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన తుది దశకు చేరుకుంది. జిల్లా విద్యాశాఖ ఉమ్మడి జిల్లాలోని 186 మంది జాబితాలను ప్రకటించింది. జాబితాలో పేర్లు ఉన్న వారిలో చాలామంది వేర్వేరు కారణాలతో ధ్రువపత్రాల పరిశీలనకు రాలేదు. ఆదివారం కూడా ధ్రువపత్రాల పరిశీలన చేపడతామని అధికారులు తెలిపారు.

96 మంది మాత్రమే హాజరు..

జిల్లా విద్యాశాఖ గత నెల 27 నుంచి శనివారం వరకు నిర్వహింతచిన ధ్రువీకరణపత్రాల పరిశీలనకు మొత్తం 96 మంది అభ్యర్థులు హాజరైనట్లు సంబంధిత అధికారులు చెప్పారు. మిగిలిన 90 మంది అభ్యర్థులు హాజరుకాకపోవడం అధికారులను విస్తుగొలుపుతోంది. పదో తరగతి మార్కుల మెమోలు, స్టడీ సర్టిఫికెట్లు వారి వద్ద లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. పరిశీలనకు హాజరుకాలేని పలువురు డూప్లికేట్ మార్కుల మెమో కోసం రాష్ట్ర విద్యాశాఖకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం వద్ద మెమోల కోసం నిరీక్షిస్తున్నారని కొందరు తెలిపారు. వీరికి అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఈ విషయంలో అధికారులు సానుకూలంగా ఉన్నారు.



డీఈవో కార్యాలయం ముందు జాబితాలో పేర్లు లేని అభ్యర్థులు

తమకూ న్యాయం చేయాలి

ధ్రువీకరణపత్రాల పరిశీలనకు జిల్లా విద్యాశాఖ ప్రకటించిన జాబితాలో అర్హులైన తమ పేర్లు లేవని, తమకు న్యాయం చేయాలని 8 మంది (పాత మెరిట్ జాబితాలో ఉన్నవారు) ఆందోళన వ్యక్తం చేశారు. కేబినెట్ సబ్‌కమిటీ సభ్యులుగా ఉన్న మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లు ఈ విషయంలో చొరవ చూపి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

ఛాంపియన్‌గా కరీంనగర్ క్రికెట్ జట్టు

కరీంనగర్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లో జరిగిన అంతర్ జిల్లాల అండర్-19 క్రికెట్ టోర్నమెంట్‌లో కరీంనగర్ జట్టు ఛాంపియన్స్‌గా నిలిచింది. శనివారం తుది పోరులో కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లా జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మహబూబ్‌నగర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 240 పరుగులు సాధించింది. కరీంనగర్ జట్టు 49.5 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. విగ్నేష్ 53 (నాటౌట్), కర్మాన్ 50, రిత్విక్ 29 పరుగులతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. మ్యాన్ ఆఫ్ ది ఫైనల్స్, మ్యాన్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా విగ్నేష్ ఎంపికైనట్లు జిల్లా జట్టు మేనేజర్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.మనోహర్‌రావు తెలిపారు. క్రీడాకారులను జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.ఆగంరావు, ఉపాధ్యక్షుడు వై.మహేందర్‌గౌడ్, సి.హెచ్ అజిత్‌కుమార్, విద్యాసాగర్‌రావులు నగదు బహుమతులు అందించి క్రీడాకారులను ప్రోత్సహించి అభినందించారు.



బహుమతి అందుకుంటున్న జిల్లా క్రీడాకారులు